క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి మాజీ ఎంపీ పరామర్శ

కంబదూరు: తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈఓ ఈరన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య గురువారం తిమ్మాపురం వెళ్లి ఈరన్న మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, బీసీ, యువజన, రైతు విభాగాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గోవింద్, ఎంఎస్ రాయుడు, హనుమంతరాయుడు, వైస్ ఎంపీపీ బీమేష్, సర్పంచ్ హరినాథ్, నాయకులు ఎర్రంపల్లి కృష్ణమూర్తి, లాయర్ హనుమంత్‌రెడ్డి, రామాంజనేయులు, ములకనూరు సత్తి, వినియోగదారుల సేవా సంఘం జిల్లా నాయకులు చల్లాకిషోర్ తదితరులు ఉన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీపై ఆడిట్


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారి రామకృష్ణ

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం 2021 ఖరీఫ్‌లో అందించిన ఇన్‌పుట్ సబ్సిడీపై గురువారం వ్యవసాయ కార్యాలయంలో ఆడిట్ జరిగింది. ఆడిట్ అధికారి రామకృష్ణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డ్ నిర్వాహణ సరిగా చేపట్టకపోవడంపై ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించిన డబ్బు దుర్వినియోగం కాకుండా నిజమైన లబ్ధిదారులకే అందిందా? లేదా ? అని తెలుసుకోవడానికే ఆడిట్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ


సీఐ వెంకటరమణతో విరాళాలను సేకరిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కళ్యాణదుర్గం: వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ విద్యార్థులతో కలిసి విరాళాల సేకరణ ప్రారంభించారు. పట్టణ సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రవిబాబు, సర్కిల్ కార్యాలయంలో సీఐ వెంకటరమణ, సిబ్బందితో విరాళాలను సేకరించారు. ఒక మనిషి...ఒక రూపాయి ప్రకారం తమవంతుగా వరద బాధితులకు సాయం చేయాలని పీఓ అభ్యర్థించారు.

సీడీపీఓ బాధ్యతల స్వీకరణ


పద్మావతి, సీడీపీఓ

రాయదుర్గం: అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేసిన ప్రాజెక్టులో సీడీపీఓగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని ఏఎల్ పద్మావతి అన్నారు. గురువారం ఆమె స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓగా బాధ్యతలు స్వీకరించారు. రాయదుర్గం మండలం ఆయతపల్లిలో 1983లో అంగన్‌వాడీ కార్యకర్తగా విధుల్లో చేరినట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టి సారిస్తామన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సూపర్‌వైజర్లు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి కార్మికుల సమ్మె మరింత ఉధృతం


ధర్నా చేస్తున్న తాగునీటి పథకం కార్మికులు

కూడేరు: మండలంలోని పీఏబీఆర్ వద్ద ఏర్పాటు చేసిన సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపకుండా కూటమి సర్కార్ నిర్లక్ష్యం వహిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మండిపడ్డారు. డిమాండ్ల సాధనలో భాగంగా ఇప్పటికే కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గురువారం పీఏబీఆర్‌లోని తాగునీటి ప్రాజెక్టుల వద్ద పంపింగ్ మోటార్లను కార్మికులు బంద్ చేసి నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ... 8 నెలలుగా జీతాలు అందక కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, కార్మికులు తిప్పేస్వామి, శీన, ఎర్రిస్వామి, రామాంజనేయులు, కొండారెడ్డి, వన్నూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

నవ భారత నిర్మాతలు ఉపాధ్యాయులు

ఉరవకొండ: ఉపాధ్యాయులు నవ భారత నిర్మాతలని లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రీజన్ చైర్మన్ పీజీఎస్‌నూర్ మహ్మద్, జోనల్ చైర్మన్ మల్లికార్జున పేర్కొన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అధ్యాపకుడు ప్రసాద్‌రెడ్డి, మహాత్మా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బసవరాజు, ఎస్ఎల్ఎన్ కాలనీ ఉర్దూ స్కూల్ హెచ్ఎం కుమల్‌సాహెబ్, జెడ్పీ సెంట్రల్ స్కూల్ పీడీ మారుతి, ఇందిరానగర్ ఉపాధ్యాయురాలు ఉమాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కార్యదర్శి నగేష్‌బాబు, కోశాధికారి జాబీర్ పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బెళుగుప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఉత్తమ అవార్డు గ్రహీత ఉపాధ్యాయులు బాలాజీ, నాగరాజు, చెన్న బసయ్యను ఘనంగా సన్మానించారు. నక్కలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సర్పంచ్ రామిరెడ్డితో కలసి బెళుగుప్ప ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ సుబ్రమణ్యం దుశ్శాలువాలు పూలమాలలతో సన్మానించారు. స్థానిక శ్రీనివాస విద్యానికేతన్, సన్‌రైజస్ పాఠశాలల్లో కరస్పాండెంట్‌లు శ్రీనివాసులు, మారెన్న ఆధ్వర్యంలో విశ్రాంత ఉత్తమ అవార్డు గ్రహీతలు పర్వతప్ప, నాగరాజును దుశ్శాలువాలు పూలమాలలు జ్ఞాపికలతో సత్కరించారు.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు దేశానికి రాధాకృష్ణన్ చేసిన సేవలు కొనియాడారు.


బొమ్మనహాళ్‌లో రిటైర్డ్ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న దృశ్యం


బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఉపాధ్యాయులు నవ సమాజ నిర్మాతలని ఎంఈఓలు మల్లికార్జున, ఈరన్న పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఎమ్మార్సీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు మఠం గురుప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను భావిపౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా వినిర్వహించారు. విశ్రాంత ఉద్యోగులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ పెన్షనర్ ఈశ్వరప్పను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు శివప్రసాద్, తిప్పేస్వామి, అంజనప్ప, మారెన్న పరిపూర్ణపతి, రాజన్న, భగవాన్, రాజ్ పాల్ నాయక్, పాండురంగ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ఎస్వీజీఎం డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ జయరాంరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో గురువారంఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కుందుర్పి పాఠశాలలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఎంఈఓ తిప్పేస్వామి తదితరులు సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. సీనియర్ ఉపాధ్యాయులు బీసీ తిమ్మప్ప, బొమ్మయ్య, రాధాకృష్ణంరాజు, బూడిద కృష్ణమూర్తి, ఈరన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: విద్యార్థులు దేశసేవకులుగా మారినప్పుడే గురువులకు గర్వంగా ఉంటుందని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటనాయుడు పేర్కొన్నారు. గురుకుల పాఠశాలలో గురువారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు గురువులను సన్మానించారు.

ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఉత్తమ అవార్డు అందుకుంటున్న బెళుగుప్ప ఎంఈఓ మల్లారెడ్డి


హరికృష్ణ, బెళుగుప్ప ఎంఈఓ-2


స్వర్ణలత కేపీ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం


ఫిరోజ్‌ఖాన్, శెట్టూరు జెడ్పీ హెచ్ఎస్


అబ్దుల్ వారిష్, జెడ్పీహెచ్ఎస్ నార్త్(కేఎల్‌డీ)


వెంకట్, జెడ్పీహెచ్ఎస్ ఉరవకొండ


సుధా మాధవి, కోనంపల్లి (బెళుగుప్ప)


విజయ్‌కుమార్, మలకనూరు (కంబదూరు)


సత్యప్రసాద్, ఎస్ఏ కేసీజీహెచ్ఎస్(కేఎల్‌డీ)


ఉమాశంకర్, జెడ్పీహెచ్ఎస్ బెళుగుప్ప

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శివశంకర్‌నాయక్

విడపనకల్లు: సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని వైద్యాధికారులు డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ శివశంకర్ నాయక్ ఆరోగ్య, ఆశా వర్కర్లకు సూచించారు. పాల్తూరు పీహెచ్‌సీలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో దోమల పెరగకుండా ఉండేలా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరామిరెడ్డి, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు బాలాజినాయక్, సందేశ్ సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దోమల వల్ల వచ్చే వ్యాధి లక్షణాలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు.

పంటకోత ప్రయోగాలు పక్కాగా చేపట్టాలి


విడపనకల్లులో మాట్లాడుతున్న ఏఓ పెన్నయ్య

కూడేరు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంబీవైఎస్) కింద 2024 ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, వేరుశనగ, ఆముదం తదితర పంటల్లో పక్కాగా పంటకోత ప్రయోగాలు చేపట్టాలని మండల గణాంకాధికారిణి ఆశ, ఏఓ విజయ కుమార్ సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో గురువారం పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. పంటకోత ప్రయోగం ఆధారంగానే రైతులకు పంట నష్ట పరిహారం, పంటల బీమా అందిస్తారన్నారు. ఎంపిక చేసిన రైతుల పొలాల్లో పారదర్శకంగా ప్రయోగాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

విడపనకల్లు: పంట కోత ప్రయోగాలు పక్కాగా చేపట్టాలి ఏఓ పెన్నయ్య సిబ్బందికి సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఎంపిక చేసిన పొలాల్లో పంటకోత ప్రయోగాలు చేపట్టాలన్నారు. మండల వ్యాప్తంగా దాదాపు మిరప 7900 ఎకరాల్లో సాగైనట్లు హార్టికల్చర్ అధికారి నెట్టికంటయ్య పేర్కొన్నారు. హార్టికల్చర్ పంటలకు సంబంధించి ఈనెల 15 తారీఖు లోపు ఈక్రాప్ నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ పర్వతప్ప, ఏఈఓ రాఘవేంద్ర ,వీఏఏలు, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


బొమ్మనహాళ్ మండలం మైలాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతా, హెల్త్ ఎడ్యుకేటర్ విజయభారతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీధరఘట్ట, మైలాపురం గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు వెంకటరమణ, బాలాజీ, నాగరత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త రాధిక తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: పౌష్టికాహారంతో అందరూ ఆరోగ్యంగా ఉండొచ్చని ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికహార మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాతాశిశు మరణాల నియంత్రణ, పౌష్టికాహారం వల్ల కలాగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వజ్రకరూరు: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని వజ్రకరూరు సర్పంచు మోనాలిసా అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వక్తలు పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేశారు. వైద్యాధికారి పవన్ కుమార్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి,ఆరోగ్యవిస్తరణఅధికారి గురుప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు సుశీలమ్మ, నాగశంకర్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గూళ్యపాళ్యం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజస్వి, ఏఎన్ఎంబ్రమరాంబ, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణమ్మ, క్రిష్ణదేవి పాల్గొన్నారు.

ఉరవకొండ: విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని రాకెట్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ అన్నారు. గురువారం ఆమిద్యాల అంగన్‌వాడీ-2లో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాబియా, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేశారు. సీహెచ్ఓ నాగరంగయ్య, అంగన్‌వాడీ కార్యకర్త నాగవేణి పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు అంకురార్పణ

బెళుగుప్ప: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో వినాయకచవితి ఉత్సవాలకు గురువారం అంకురార్పణ చేశారు. ఈసందర్భంగా గణపతి, నవగ్రహ హోమాలు, కలశస్థాపన చేపట్టారు. శుక్రవారం సంప్రోక్షణ పూజలు, అభిషేకాలు, శనివారం చవితి పూజలు, ఆదివారం ప్రత్యేక పూజలు అభిషేకాలు, సోమవారం అన్నదానం, గ్రామోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని అర్చకులు తెలిపారు.

నిల్వ ఉంచిన మాంసాన్ని తినొద్దు

కుందుర్పి: నిల్వ ఉంచిన మాంసాన్ని తినొద్దని డాక్టర్ అనూషా ప్రజలకు సూచించారు. గురువారం మలయనూరు, జంబుగుంపల పంచాయతీల్లో ప్రజలకు నిల్ల ఉంచిన మాంసాన్ని తినడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కర్ణాటక సరిహద్దున ఉన్న మలయనూరు పంచాయతీలోని వడ్డెపాళ్యం, శ్రీమజ్జనపల్లి, నాగేపల్లిలో మాంసాన్ని ఎండబెట్టిన మాంసాన్ని తింటున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి మాంసంతో ఆరోగ్యం పూర్తి దెబ్బతినడంతో పాటు గుండె సంబంధిత వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు గోవిందమ్మ, గంగాధర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కనకదాస విగ్రహ ప్రతిష్ట

వజ్రకరూరు: గడేహోతురు గ్రామంలో గురువారం భక్త కనకదాసు విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. ఉదయం నుంచి గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్చారణల మధ్య కనకదాస విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కురుబ సంఘం నాయకులు యడవలపరమేష్, అట్టెల హరి,గోవిందు, నాగేంద్ర, వసంత, బసప్ప, లింగప్ప, రామాంజనేయులు, చిన్నపులికొండ, శివలింగ, నాగరాజు,సిద్దప్ప, తాయన్న, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మదర్ థెరిస్సాకు ఘన నివాళి

వజ్రకరూరు: స్థానిక బీసీ బాలుర ప్రభుత్వ వసతి గృహంలో గురువారం మదర్ థెరిస్సా 27వ వర్థంతి నిర్వహించారు. ఈసందర్భంగా మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మదర్ థెరిస్సా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మల్లికార్జున, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కణేకల్లు సెబ్ ఎస్ఐకు పదోన్నతి


ప్రసాద్‌రావు

కణేకల్లు: కణేకల్లు సెబ్ ఎస్ఐగా పని చేస్తున్న ప్రసాద్‌రావుకు సీఐగా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు సెబ్‌స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న ప్రసాద్‌రావును ఎన్నికల సమయంలో అధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ప్రమోషన్ ఉత్తర్వులు జారీ అయ్యాయని, త్వరలో ప్లేస్‌మెంట్ కేటాయిస్తారని కణేకల్లు సీఐ మురళీకిశోర్ తెలిపారు.

అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి


ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

రాయదుర్గంటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో తొలగించిన అవుట్‌సోర్సింగ్ డ్రైవర్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ డిపోలో ముందు తొలగించిన డ్రైవర్లతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చిన్నచిన్న తప్పిదాల వల్ల దాదాపు 14 మంది కార్మికులను వారిని విధుల నుంచి తొలగించారన్నారు. డీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుల తప్పిదాలపై జిల్లాలోని ఇతర డిపోల్లో అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి తిరిగి విధుల్లో తీసుకున్నారని, కాని ఇక్కడ మాత్రమే డీఎం పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డీఎంకు అందజేశారు.

బాలికా విద్యతోనే సమాజాభివృద్ధి


మాట్లాడుతున్న వైద్యుడు రమేష్

రాయదుర్గంటౌన్: బాలికా విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని వైద్యుడు రమేష్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కస్తూర్బా జూనియర్ కళాశాలలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యుడు రమేష్ మాట్లాడుతూ మహిళా జాతిని రక్షించుకోకపోతే సృష్టిలో మానవ మనుగడ లేకుండా పోతుందన్నారు. తల్లిదండ్రుల బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాల్య వివాహాలతో అనర్థాలు చాలా ఉన్నాయన్నారు. ఎవరైనా బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం వాల్మీకినగర్‌లో సీజనల్ వ్యాధులపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మీ, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

15లోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి


నేత్రపల్లిలో దానిమ్మ పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

గుమ్మఘట్ట: ఉద్యాన రైతులు ఈ నెల 15వ తేదీలోగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని నేత్రపల్లి రాయదుర్గం మండలం ఆవులదట్ల, వజ్రహొన్నూరు, బీఎన్‌హళ్లిలో సాగు చేసిన చినీ, దానిమ్మ పంటలను ఏపీ ఎంఐపీ పీడీ రఘునాథరెడ్డితో కలిసి పరిశీలించారు. ఉద్యానవన పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి మౌనిక, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, ఎంఐఏఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

బ్రహ్మసముద్రం : బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కళ్యాణదుర్గం సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న హెచ్చరించారు. గురువారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో ఆర్డీటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల కట్టడిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. బాలికలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలను లఘు చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 క్రిష్ణానాయక్, ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఖాసీంబీ, కేజీబీవీ ఎస్ఓ మహాలక్ష్మీ, ఉపాధ్యాయులు ఇందిర , మహతాజ్, వనమాల, ప్రమీలా, గీతాంజలి , జ్యోతి, శాంతి, ఏఎన్ఎం నాగమణి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం


రెవెన్యూ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్న సీఐ వెంకటరమణ

కళ్యాణదుర్గం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని పట్టణ సీఐ వెంకటరమణ సూచించారు. గురువారం పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. స్టేషన్‌కు వచ్చే వారు విధిగా ఎక్కడో ఒక చోట ఒక మొక్కను నాటాలని కోరారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్లో కేసుల వివరాలు, పట్టుబడిన వాహనాలు తదితర విషయాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతన సీఐకు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షులు టైలర్ వన్నూరుస్వామి, తాలూకా అధ్యక్షులు లక్ష్మణమూర్తి, చెన్నప్ప, సురేష్, నారాయణ, ఆంజనేయులు శుభాకాంక్షలు తెలియజేశారు.